సూర్య
నేటి దినపత్రిక
18వ వసంతంలోకి...
www.suryaa.com
ఎన్టీఆర్ - కృష్ణా
గురువారం 6 మార్చి 2025 పేజీలు 8



**రంజాన్ వేళలు**
ఇఫ్తార్
సా. 6:20 (గురువారం)
సెహరీ
ఉ. 5:02 (శుక్రవారం)

పేదరికం లేని సమాజం లక్ష్యంగా

# పీ4 సర్వే

- ఈ నెల 8 నుంచి సచివాలయ సిబ్బంది ద్వారా కార్యక్రమం
- సమష్టి భాగస్వామ్యంతో సర్వేను విజయవంతం చేయాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ

2



## పటిష్ట సమన్వయంతో..

### మహిళా దినోత్సవ వేడుకలను విజయవంతం చేద్దాం..

- మహిళా భద్రత, సాధికారతను ప్రతిబింబించేలా స్టాళ్ల ఏర్పాటు
- డీఆర్డీఏ, మెప్మా తదితర విభాగాల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు
- గౌరవ ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో వేడుకల నిర్వహణ
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మార్చి 5, మేజర్ న్యూస్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా భద్రత, సాధికారతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాయని.. వివిధ పథకాలు, కార్యక్రమాల ఫలాలను స్త్రీ శక్తికి చేరువచేసి, వారిని సమగ్రాభివృద్ధి దిశగా నడిపించేలా

2లో

### అన్నం పెట్టే పథకం... అక్రమార్కుల పాలు

అసెంబ్లీలో రేషన్ బియ్యం అక్రమ తరలింపు అంశంపై ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావ్



వివరాలు 2లో

### కాలువ పనులు నీటి సంఘాలకే అప్పగించాలి

ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



వివరాలు 2లో

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

## ఘనంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ

మచిలీపట్నం మేజర్ న్యూస్ : మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని జిల్లాలో ఆ రోజు వేడుకలు ఘనంగా నిర్వహించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో ఆయన జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి మెప్మా, డి ఆర్ డి ఏ, ఐసిడిఎస్, మైనారిటీ, పోలీసు, మున్సిపల్, వైద్య ఆరోగ్య తదితర శాఖల అధికారులతో జిల్లాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల

2



### బుడమేరు గండ్లను శాశ్వతంగా పూడ్చాలి

ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు



వివరాలు 7లో

### అడవి ఆవుల బారి నుంచి రైతాంగ పంటలను ఆదుకోండి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



వివరాలు 7లో

### కూచిపూడి అభివృద్ధికి సహకరించండి

ఎమ్మెల్యే కుమార్ రాజా



వివరాలు 7లో


రాయల్ రెస్టారెంట్ టిఫిన్స్ & బిర్యాని
కోర్టు రోడ్, నేతాజీ నగర్, నందిగామ




నేడే ప్రారంభోత్సవం



రంజాన్ మాసం సందర్భంగా ప్రతిరోజు హలీం లభించబడును
అన్ని రకముల ఫంక్షన్లకు వెజ్ అండ్ నాన్‌వెజ్ ఆర్డర్లపై కేటరింగ్ చేయబడును.
చికెన్, మటన్, దమ్ బిర్యాని బాస్మతి రైస్‌తో చేయుట మా ప్రత్యేకత.
ఉచిత హోమ్ డెలివరీ సౌకర్యం కలదు.
సెల్ : 8978671557



ప్రొప్రైటర్
ఎం.డి.ఇబ్రహీం

(మొదటిపేజీ తరువాయి)



## అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సాధికారతను చాటేలా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు ఆయా శాఖలు సమన్వయంతో కృషి చేయాలన్నారు.వివిధ రంగాలలో విజయం సాధించిన మహిళలకు తగిన గౌరవం, గుర్తింపు ఇచ్చే విధంగా ఆ రోజున వారికి సన్మానాలు, అదేవిధంగా వారిచేత ప్రేరణాత్మక అనుభవాలను పంచుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వేడుకల్లో ఆయా శాఖలకు సంబంధించిన స్టాల్స్ ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో బందరు డిఎస్పి చప్పిడి రాజా, మెప్మా పీడీ సాయిబాబు, నగర మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, డి ఎం ఎన్ హెచ్ ఓ డాక్టర్ శర్మిష్ఠ, ఐసిడిఎస్ పిడి ఎంఎన్ రాణి, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ఆర్ వెంకట్రావు, సెర్ప్, మైనారిటీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కాలువ పనులు నీటి సంఘాలకే అప్పగించాలి

### క్వశ్చన్ అవర్లో సభ దృష్టికి తీసుకొచ్చిన గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

### ఎమ్మెల్యే రాము సూచనలపై స్పందించిన ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు

### ఎమ్మెల్యే రాము చాల చక్కటి సూచనలు చేశారు

### ఉప సభాపతి రఘురామ కృష్ణంరాజు

**గుడివాడ, మేజర్ న్యూస్:** రైతులకు మేలు జరిగేలా ఇరిగేషన్ కాలువల్లో సక్రమంగా నీరు ప్రవహించే పనులను స్థానికంగా ఉండే రైతు సంఘాలకు అప్పగించాలని అసెంబ్లీ సమావేశాల క్వశ్చన్ అవర్లో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి ఎమ్మెల్యే రాము పలు సూచనలు చేశారు. కాలువల్లో పనులు చేయడానికి కాంట్రాక్టులు దక్కించుకున్న వారు సమస్యలను గాలికి వదిలేసి డబ్బులను జేబులో వేసుకోవడమే పరమావధిగా పనిచేస్తున్నారన్నారు. కాంట్రాక్టర్లు చేసే నిర్లక్ష్యానికి కాలవల్లో సమస్యలు పరిష్కారం కాక రైతులు నష్టపోవాల్సి వస్తుందని సభ ముఖంగా ఎమ్మెల్యే రాము ఆవేదన వ్యక్తం చేశారు. కాలవల ప్రాధాన్యత తెలిసిన నీటి సంఘాలకు కల్వల పనులు అప్పగిస్తే న్యాయం జరుగుద్దన్నారు. ఎమ్మెల్యే రాము ప్రశ్నలకు స్పందిస్తూ ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు సభలో వివరణ ఇచ్చారు 2014-19 టిడిపి పాలనలో స్థానికంగా ఉన్న రైతుల భాగస్వామ్యంతో నీటి సంఘాల ఆధ్వర్యంలో పనులు సజావుగా జరిగేవన్నారు. 2019-24 కాలంలో నీటి సంఘాలను రద్దు చేయడంతో ఇరిగేషన్ వ్యవస్థ నిర్వీర్యమై, విధ్వంసం చెందిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే 60 వేల మంది రైతుల భాగస్వామ్యంతో తిరిగి నీటి సంఘాలను పునరుదించినట్లు సభా వేదికగా మంత్రి తెలియచేశారు. కాలువల శివారు ప్రాంతాలకు నీరు రాకపోతే స్థానిక రైతులు నీటి సంఘాల అధ్యక్షుడి దృష్టికి తీసుకువస్తున్నారని తద్వారా సమస్య పరిష్కారం కావడమే కాక రైతులందరికీ నీరు అందుతుందని మంత్రి రామానాయుడు తెలియచేశారు. ప్రస్తుతం డిసి చైర్మన్లు, డెల్టా చైర్మన్లు, నీటి సంఘాల అధ్యక్షులు కొన్నిచోట్ల జేబులో డబ్బులను ఖర్చు చేస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారని మంత్రి వివరించారు. గత టిడిపిలో హయంలో జరిగిన మాదిరిగానే పెరిగిన వ్యయాన్ని దృష్టిలో ఉంచుకొని 10 లక్షల వరకు వర్కులను నామినేటెడ్ పద్ధతిలో స్థానిక నీటి సంఘాలకి అప్పగించేలా నిర్ణయాలు తీసుకోవాలని అధికారులకు చెప్పడం జరిగిందని మంత్రి రామానాయుడు తెలిపారు. నీటి సంఘాల భాగస్వామ్యంతోనే రైతులకు సేవ చేయడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ఆలోచిస్తున్నారని సభలో మంత్రి రామానాయుడు అన్నారు. ఎమ్మెల్యే రాము చాలా చక్కటి సూచనలు చేశారనీ ఉప సభాపతి రఘురామ కృష్ణంరాజు అన్నారు. మా నియోజకవర్గంలో పలువురు నీటి సంఘాల అధ్యక్షులు బిల్లుల గురించి ఆలోచించకుండా కాలవల్లో సమస్యలు పరిష్కరించడానికి సొంత డబ్బులు ఖర్చు చేస్తున్నారని అన్నారు. అదేవిధంగా ఆక్వాకల్చర్ లో వినియోగించిన నీటిని పంట కాలువల్లోకి వదలకుండా డ్రైన్లలో మాత్రమే వదిలేలా చర్యలు తీసుకోవాలని మంత్రి రామానాయుడుకు సూచించారు. ఈ ప్రక్రియను సక్రమంగా ఇంప్లిమెంట్ చేస్తే ఆక్వా అభివృద్ధితోపాటు, వ్యవసాయ రైతాంగానికి కూడా ఇబ్బందులు లేకుండా సంతోషంగా ఉంటారని, ఆక్వా అధికంగా ఉండే ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణాజిల్లాలో ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సభలో ఉప సభాపతి రఘురామ కృష్ణం రాజు మంత్రి రామానాయుడుకు సూచించారు. ఈ సందర్భంగా సభకు ఎమ్మెల్యే రాము ధన్యవాదాలు తెలియచేశారు.

# పటిష్ట సమన్వయంతో మహిళా దినోత్సవ వేడుకలను విజయవంతం చేద్దాం



(మొదటిపేజీ తరువాయి)

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను విజయవంతం చేద్దామని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో వేడుకల నిర్వహణకు సంబంధించి దిశానిర్దేశం చేసేందుకు రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేడుకల నిర్వహణకు సూచనలు చేశారు. ప్రభుత్వ దార్శనికతకు అనుగుణంగా వివిధ శాఖల సమష్టి భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. వీసీ అనంతరం కలెక్టర్ లక్ష్మీశ.. డీఆర్డీఏ, మెప్మా, వైద్య ఆరోగ్యం, స్త్రీ, శిశు సంక్షేమం, పరిశ్రమలు తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి, శాఖల వారీగా కార్యాచరణను వివరించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయం మొదలు, రాష్ట్ర స్థాయి వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని.. ఎన్టీఆర్ జిల్లాస్థాయి కార్యక్రమం నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. గౌరవ ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషిచేయాలన్నారు. వివిధ శాఖల పరిధిలో మహిళాభివృద్ధికి అమలవుతున్న పథకాలు, కార్యక్రమాలపై మహిళలను జాగృతం చేసి.. వాటిని సద్వినియోగం చేసుకునేలా ముందుకు నడిపించేందుకు స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. డీఆర్డీఏ, మెప్మా తదితర విభాగాలు ఇందుకు ప్రణాళికాయుతంగా వ్యవహరించాలన్నారు. బ్యాంకు లింకేజీ మద్దతు, ప్రకృతి సేద్యం ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్, మిల్లెట్స్ విలువ జోడింపు, మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు చేయూతనిచ్చే పథకాలు, కార్యక్రమాలు, పోషణ భద్రత, పీఎం విశ్వకర్మ, పీఎంఈజీపీ వంటి పథకాలు, లఖ్‌పతిదీదీ, డ్రోన్ దీదీ తదితరాలకు సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. మహిళల భద్రతకు ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగా వినియోగిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వంటివాటిపైనా దృష్టిసారించాలని.. ప్రత్యేక అవగాహన ర్యాలీల నిర్వహణకూ ఏర్పాటు చేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, పీవో-యూసీడీ వెంకటరత్నం, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, డా. ఎన్టీఆర్ వైద్యసేవ సమన్వయకర్త డా. జె.సుమన్, ఐసీడీఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, ఏసీపీ కె.లతాకుమారి, ఎల్డీఎం కె.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# పేదరికం లేని సమాజం లక్ష్యంగా పీ4 సర్వే

**ఎన్టీఆర్ జిల్లా, మార్చి 5, మేజర్ న్యూస్ :** పేదరికం లేని సమాజ నిర్మాణం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్ (పీ4) సర్వేకు రూపకల్పన చేయడం జరిగిందని.. ఈ నెల 8వ తేదీ నుంచి 18వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా సర్వే జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. బుధవారం కలెక్టర్ లక్ష్మీశ.. ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లతో వర్చువల్‌గా పీ4 సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ నెల 6, 7 తేదీల్లో రెండురోజుల పాటు మాస్టర్ ట్రైనర్లుగా ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు తమ పరిధిలోని గ్రామ లేదా వార్డు సచివాలయ సిబ్బందికి సర్వేపై పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. టెక్ మాడ్యూల్‌తో పాటు సర్వే విధానాన్ని క్షుణ్ణంగా వివరించాలన్నారు. పేదరికాన్ని దూరం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికాయుతంగా చేపడుతున్న కార్యక్రమాలకు అదనంగా సామాజికంగా, ఆర్థికంగా పైన ఉన్న కుటుంబాలు సామాజిక బాధ్యతగా అట్టడుగున ఉన్న కుటుంబాలకు మద్దతుగా నిలిచేలా ప్రోత్సహించడం పీ4 విధానం లక్ష్యమని వివరించారు. పేదల అవసరాలను గుర్తించి.. వారి సమగ్రాభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టుల రూపకల్పనకు ఈ సర్వే దోహదం చేస్తుందని.. కుటుంబాలు ప్రస్తుతం అందుకుంటున్న పథకాలపై ఈ సర్వే ఎలాంటి ప్రభావం చూపదని స్పష్టం చేశారు. సర్వే ద్వారా సేకరించిన డేటా ఆధారంగా ఇంటి అవసరాలకు అనుగుణంగా సమర్థవంతమైన ప్రణాళికల రూపకల్పనకు వీలవుతుందన్నారు. ఈ సమాచారాన్ని కుటుంబాలకు వివరించి.. కుటుంబ వివరాలతో పాటు వివిధ సామాజిక, ఆర్థిక పరామితుల కచ్చితమైన సమాచారాన్ని యాప్‌లో పొందుపరచాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కుటుంబాలకు ఏవైనా అపోహలు ఉంటే తొలగించి, సర్వేను పది రోజుల్లో పూర్తిచేయాల్సి ఉంటుందన్నారు. అన్ని సమన్వయ శాఖల సమష్టి భాగస్వామ్యంతో సర్వేను విజయవంతంగా పూర్తిచేసేందుకు క్షేత్రస్థాయి అధికారులు కృషిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. సమావేశంలో సీపీవో వై.శ్రీలత, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అన్నం పెట్టే పథకం... అక్రమార్కుల పాలు

**గన్నవరం, మార్చి 5, మేజర్ న్యూస్ :** అన్న నందమూరి తారకరామారావు 60 ఏళ్ల వయసులో రాజకీయ పార్టీ స్థాపించి కేవలం ఆరు నెలల కాలం లోనే అధికారంలోకి తీసుకువచ్చి అనేక సంస్కరణలు తీసుకుని వచ్చి, తనదైన ముద్రతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావ్ పేర్కొన్నారు. అసెంబ్లీ లో రేషన్ బియ్యం అక్రమ తరలింపు అంశం పై ఆయన మాట్లాడారు. పేదవాడికి పట్టెడు అన్నం పెట్టలేనప్పుడు రాజకీయాలు ఎందుకంటూ ఎన్.టి.రామారావు 1983 జూలై 6న రెండు రూపాయలకు కిలో బియ్యం పథకం ప్రారంభించారని అన్నారు. అలాంటి గొప్ప పథకంలో వైసీపీ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో డీలర్ల వ్యవస్థను పక్కనపెట్టి ఇంటి వద్దకే ఎండియుల ద్వారా బియ్యం పంపిణీ చేసే కొత్త వ్యవస్థకు తెరలేపి, కొంతమంది మధ్య వర్తులు, ఎండియుల ద్వారా అక్రమ రవాణా చేసారని ఆరోపించారు. నిన్న సభలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే బుచ్చియ్య చౌదరి, ప్రస్తావించినట్లే ఇప్పటికీ రేషన్ కార్డే అన్ని పథకాలకు ప్రామాణికం అని, రేషన్ కార్డు లేదంటే పథకాలు రద్దువుతాయని, చాలామంది లబ్దిదారుల్లో ఆందోళన ఉందన్నారు. బియ్యం తీసుకోపోతే కార్డు రద్దవుతుందనే భయంతోనే చాలామంది లబ్దిదారులు వారికి అవసరం లేకున్నా బియ్యం తీసుకోవడం వల్ల బ్లాక్ మార్కెట్ కు తరలిపోవడం కూడా కారణమన్నారు. రాష్ట్రంలో షుమారు కోటి నలబై ఎనిమిది లక్షల రైస్ కార్డ్స్ ఉండగా, గత నెలలో కేవలం కోటి ముప్పై మూడు లక్షల కార్డు దారులు బియ్యం తీసుకోగా 15 లక్షల మంది బియ్యం తీసుకోని పరిస్థితి ఉందన్నారు. కాకినాడ పోర్ట్ లో అక్రమంగా ఎగుమతి చేస్తున్న కొన్ని వందల టన్నుల పేదల బియ్యాన్ని కలెక్టర్ పట్టుకోగా, స్వయంగా డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, సివిల్ సప్లై మినిస్టర్ నాదెండ్ల మనోహర్ వెళ్లి తనిఖీ చేసారని గుర్తు చేశారు. లోపభూయిష్టమైన ఈ పథకం వలన కొన్ని వేల మెట్రిక్ టన్నుల పేదల బియ్యం అక్రమ రవాణా జరుగుతుందన్నారు. అసలు బియ్యం పథకం ఉన్నది పేదలకు ఇవ్వడానికా ఎగుమతులు చేయడానికి అనే స్థితికి పథకం చేరిందన్నారు. దానికి తార్కాణం ఎక్కడ చూసినా ఈ బియ్యం ఆఫ్రికా వంటి దేశాలకు ఎగుమతి అవ్వడమని చెప్పారు. కానీ నేటి రోజుల్లో ఏ స్కాం చూసినా బియ్యం చుట్టూ తిరిగే పరిస్థితి. అలాంటి పేద వారి బియ్యం పక్కదారి పట్టించడం బాధాకరం, శిక్షార్హమన్నారు. నాలుగు దశాబ్దాల పైబడి అమలవుతున్న బియ్యం పథకం పై సమీక్ష, చర్చ జరిపి పరిష్కారం కనుక్కోవడం అవసరమని అలాగే గత ప్రభుత్వం చేసిన రేషన్ స్కామ్ పై విచారణ చేయాలని కోరారు.

**పోలవరం - ఏలూరు కాలువ అనుసంధాన వ్యయం పెరిగింది.**

గత ప్రభుత్వం అలసత్వం కారణంగా పోలవరం - ఏలూరు కాలువ అనుసంధానం నిర్మాణం ఆలస్యమై వ్యయం పెరిగిందని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ప్రాజెక్ట్ కోసం రూ.15.60 కోట్లు కేటాయించినా, ఆలస్యం కారణంగా తిరిగి రూ. 32 కోట్లకు అంచనా వ్యయం పెరిగిందని తెలిపారు. అలానే రామవరప్పాడు, ఎనికేపాడు, జక్కుల నెక్కలం ప్రాంతాల్లో ఏలూరు కాలువపై పైవంతెనలు నిర్మాణం చేయాలని కోరారు. రూ.13 కోట్లతో నిర్మించే ఈ పై వంతెనల కారణం గా 15 వేల ఎకరాల సాగుకు, 18,000 మంది ఉత్తరాంధ్ర వలస ప్రజలకు ప్రయోజనం కలిగిస్తాయి అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

**మల్లవల్లి పారిశ్రామిక వాడ రాష్ట్రానికి తలమానికమవుతుంది.**

మల్లవల్లి పారిశ్రామిక వాడ రానున్న రోజుల్లో రాష్ట్రానికి తలమానికంగా మారనుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. పారిశ్రామిక వాడలో సమస్యలు త్వరగా పరిష్కరించాలని, 479 ఎకరాల అసైన్డ్ భూమిని భూసేకరణ చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. పరిశ్రమల అభివృద్ధికి రూ.3156 కోట్లు కేటాయించారని పేర్కొంటూ... మల్లవల్లి పారిశ్రామిక వాడలో 183 మంది పారిశ్రామిక వేత్తలు పరిశ్రమలు నెలకొల్పేందుకు సిద్ధంగా ఉన్నారు అని తెలిపారు. గతంలో వెనక్కి వెళ్లిపోయిన అశోక్ లేలాండ్ పరిశ్రమను తిరిగి తీసుకువచ్చానని, ఈ నెలలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని వెల్లడించారు.

**ఆర్ & బి శాఖకు నిధుల కేటాయింపు అభినందనీయం.**

గతంలో తన నియోజకవర్గంలో మంజూరైన రహదారి పనులు రద్దయిన పరిస్థితి ఉందని, అవన్నీ మళ్లీ మంజూరు చేయాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కోరారు. ఈ విషయాన్ని ఆర్ అండ్ బి మంత్రి జనార్దన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు. అవసరమైన నిధులు త్వరగా విడుదల చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

# పట్టణ సచివాలయ ఉద్యోగుల సంఘం నియామకం



**పెడన, మేజర్ న్యూస్ :** సచివాలయ ఉద్యోగులు భజనలతో కాకుండా బాధ్యతతో, పార్టీలతో సంబంధం లేకుండా ప్రభుత్వంతో కలిసి పని చేస్తూ ప్రజా సమస్యల పరిష్కార దిశగా ప్రతి ఉద్యోగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు పి.రాము అన్నారు. ఈ మేరకు పట్టణ సచివాలయ ఉద్యోగుల ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని పాది ఖానా లో నిర్వహించారు.

ఈ సందర్భంగా పట్టణ సచివాలయ ఉద్యోగ సంఘ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు పట్టణ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా పి.రవి కుమార్, ఉపాధ్యక్షు లుగా ఎం మానసవీణ, సెక్రటరీగా అబ్దుల్ సమద్, ట్రెజరరిగా ఎం. శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా జి.శివకుమార్,, కమిటీ నెంబర్లుగా బి. రమ్య, కే.మణికంఠ పజిల్లున్నీసా బేగం, నియామకం జరిగిందన్నారు. అనంతరం ఉద్యోగులకు సంబంధించిన డైరీ ని ఆవిష్కరించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు బాధ్యతతో మెలగాలని, ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా పని చేయాలని పార్టీలకు అతీతంగా ప్రభుత్వంతో కలిసి ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా ప్రధాన కార్యదర్శి టి.వి.వి.ఎస్. వరప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సింహాద్రి రాంబాబు, పి.వి పరమేశ్వరరావు, గొల్లపూడి శ్రీనివాసరావు, కే.లోకేశ్వరరావు ఎస్.వి.వి. రామారావు, కె.వి.ఆర్ దుర్గాప్రసాద్, పట్టణ సచివాలయ ఉద్యోగులు, తదితరులు ఉన్నారు.

## అనుమానాస్పదంగా యువకుడు మృతి



**మొవ్వ (మార్చి 5) మేజర్ న్యూస్:** అనుమానాస్పదంగా యువకుడి మృత దేహం కాజ గ్రామ శివారు అయినంపూడి మురుగు కాలవలో లభ్యం కావడంతో కాజ గ్రామంలో సంచలనం సృష్టించింది. కూచిపూడి ఎస్సై ఎం సుబ్రహ్మణ్యం అందించిన వివరాల మేరకు కాజా గ్రామానికి చెందిన రాజులపాటి వీర వెంకట రాజేష్(27) కాజా గ్రామ శివారులో గల అయినంపూడి మురుగు కాలవలో శవమై కనిపించడం పై పాత కక్షలను పురస్కరించుకుని జోగి శివ మధుసూదన్ రెడ్డి, బొల్లా శ్రీను, తాత హరికృష్ణ లు తమ కుమారుడిని హత్య చేసి మురుగు కాలవలో వేశారని మృతుడు తల్లి రాజులపాటి రామలక్ష్మి కూచిపూడి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సంఘటనపై పామర్రు సి ఐ సుబాకర్, కూచిపూడి ఎస్సై ఎం సుబ్రహ్మణ్యం సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కూచిపూడి ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు.


## అగ్నికి ఆహుతి అయిన సుబాబుల్ తోట

### ఐదు లక్షల ఆస్తి నష్టం





**కంచికచర్ల మార్చి 5 మేజర్ న్యూస్ :** గొట్టుముక్కల సమీపంలో ఉన్న సుబాబుల తోటలలో అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు మూడు ఎకరాలకు పైగా సుబాబులు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. మరో నాలుగు ఎకరాలలో పంటలు లేనప్పటికీ గడ్డి దగ్ధమైంది. దీంతో ఆస్తి నష్టం తగ్గింది. వేసవికాలంలో భానుడు ప్రచండ రూపంతో ఉండటంతో వెంటనే నిప్పు అంటుకొని సుబాబులు తోటలు పూర్తిగా దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన ఆ లోకం శ్రీనివాసరావు, ఆ లోకం వేణు కు చెందిన మూడు ఎకరాలకు పైగా సుబాబులు అగ్నికి ఆహుతి అయ్యాయి.కంచికచర్ల అగ్నిమాపక కేంద్రానికి ఫోను చేసినప్పటికీ శకటం అందుబాటులో లేకపోవడంతో నందిగామ నుండి అగ్నిమాపక శకటం సంఘటనా స్థలానికి చేరేసరికి పంటలు పూర్తిగా దగ్ధమయ్యాయి. అగ్ని చుట్టుపక్క పొలాలకు పాకకుండా నందిగామ అగ్నిమాపక సిబ్బంది నీటితో అగ్నిని అదుపు చేశారు.నాలుగు ఎకరాలలో కలుపు గడ్డి తగలబడటంతో దానివల్ల చుట్టుపక్కల ఉన్న సుబాబులు కు కూడా ప్రమాదం ఏర్పడగా అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. అగ్ని ప్రమాదం వలన సుమారు 5 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది.



## వైభవంగా అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

**చల్లపల్లి మేజర్ న్యూస్ :** స్థానిక నిమ్మలతోటలోని శ్రీహరిహర పుత్ర అయ్యప్ప స్వామి వారి ఆలయ అష్టమ వార్షికోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం ముద్రాంగ అర్చన, పంచహారతి, శేమేళీ, గణపతిహోమం, అయ్యప్ప స్వామికి అష్టాదశ కలశాభిషేకం, అన్నాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకులు భాను నంబూద్రిచే జరిగాయి. ఆలయ వ్యవస్థాపకులు అన్నవరపు పాండురంగారావు, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, కమిటీ పెద్దలు మర్గాని చంద్రశేఖరరావు, ఆకుల ధనుంజయరావు, తుమ్మల వెంకటేశ్వరరావు, మునంగి శివ తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు, యువనేత మండలి వెంకట్రామ్ అయ్యప్పస్వామిని దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, రావులపల్లి పండు గురుస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకులు భాను నంబూద్రి, అన్నవరపు పాండురంగారావు, ఆకుల వృద్ధి తదితరులు వెంకట్రామ్ను ఆలయ మర్యాదలతో సత్కరించారు. వార్షికోత్సవం సందర్భంగా భక్తులకు అన్నసమారాధన జరిగింది. సుమారు ఐదు వేల మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

## ఆలయ పునః ప్రతిష్ఠాపన కార్యక్రమం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** స్థానిక ఈడేపల్లి కురుమ వీధిలో జీర్ణోద్ధరణ చేసిన ప్రాచీన శ్రీ అయోధ్య రామ,, బీరప్ప స్వామి, ఆలయంలో పునః ప్రతిష్ఠ చేయనున్న విగ్రహాల పూజ కార్యక్రమంలో భాగంగా విష్ణుభట్ల సూర్య నారాయణ శర్మ ఘనాపాఠి, వారి శిష్య బృందం బ్రహ్మత్వంలో గురువందనం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, వాస్తు పూజ, హోమం, పర్యాగ్ని కరణం, యాగశాల ప్రవేశం,షోడశ స్తంభ పూజ, అఖండ స్థాపన, అంకురారోపణ, వాస్తు, క్షేత్రపాలక, చతుష్షష్టి యోగిని, నవగ్రహ పరివార దేవత ఆవాహనలు, విగ్రహ సూక్తి, బుధవారం హోమములు దేవతామూర్తులను ధాన్యాధివాసంలో ఉంచారు. భక్తుల చేత ధాన్యాన్ని విగ్రహాలపై వేయుటకు అనుమతించారు. పంచామృత,పంచగవ్య, అధివాసములు మొదలైన కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు.

## వేసవిలో తాగునీరు సమస్య లేకుండా చూడాలి



**నందిగామ, మార్చి 5, మేజర్ న్యూస్:** స్థానిక శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య ఆదేశానుసారం బుధవారం స్థానిక 1, 2, 3, 4, 5, 6 వార్డు సచివాలయాల్లో పర్యటించిన మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణ కుమారి వార్డు సచివాలయ పరిధిలోని ప్రజలు ఎటువంటి తాగునీరు, శానిటేషన్, డ్రైన్లు, విద్యుత్ దీపాల సమస్యల తో ఇబ్బందులు ఎదురు కాకుండా చూడవలసిన బాధ్యత సచివాలయ సిబ్బంది పూర్తిస్థాయిలో చూడాలని కృష్ణకుమారి ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో నందిగామ పట్టణ అధ్యక్షులు ఏచూరి రామకృష్ణ,పట్టణ ప్రధాన కార్యదర్శి కాసర్ల లక్ష్మీనారాయణ, పట్టణ ఉపాధ్యక్షులు కొప్పాకుల శ్రీనివాసరావు కౌన్సిలర్లు, ఇన్చార్జులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## టొయోటా నుంచి ఎంటి గ్రేడ్ లెజెండర్ 4X4



**విజయవాడ మేజర్ న్యూస్ :** అధిక పనితీరు, సాహసోపేతమైన, స్టైలిష్ ఎస్యూవీలకు పెరుగుతున్న డిమాండ్ను తీర్చటానికి, టొయోటా కిర్లోస్కర్ మోటర్, టొయోటా లెజెండర్ 4X4 యొక్క మాన్యువల్ ట్రాన్స్మిషన్ వేరియంట్ను ప్రవేశపెట్టింది. థ్రిల్ కోరుకునే డ్రైవింగ్ ప్రేమికుల కోసం రూపొందించబడిన ఈ కొత్త వేరియంట్, శక్తి, లగ్జరీ, అత్యాధునిక సాంకేతికత యొక్క పరిపూర్ణ సమ్మేళనాన్ని అందిస్తుంది. 6-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్మిషన్ ఖచ్చితత్వాన్ని పెంచుతుంది. టొయోటా యొక్క అధునాతన 4X4 టెక్నాలజీ డ్రైవర్లకు విభిన్న ఆఫ్-రోడ్ ఎస్కేప్లకు ఆదర్శవంతమైన సహచరుడిగా చేస్తుంది. లెజెండర్ 4X4 ఎంటి బుకింగ్ కోసం సమీప టొయోటా డీలర్షిప్ను సందర్శించవచ్చు లేదా టొయోటా భారత్ వెబ్సైట్లో ఆన్లైన్లో బుక్ చేసుకోవచ్చు

## డా. బి. ఆర్. అంబేద్కర్ గురుకులాల్లో దరఖాస్తులు చేసుకోండి

**విజయవాడ, మేజర్ న్యూస్:** ఆంధ్ర ప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డా. బి. ఆర్. అంబేద్కర్ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం (ఆంగ్ల మాధ్యమం)లో ప్రవేశానికి దరఖాస్తులు సమర్పించవలెనని ఏపీఎస్ డబ్ల్యూఆర్ఈఐ సొసైటీ కార్యదర్శి వి. ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్ లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణకు గడువును ఈ నెల 13వ తేదీ వరకూ పొడిగించినట్లు తెలిపారు. ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అర్హత గల అభ్యర్థులు ది. 13-03-2025 తేదీ లోపల దరఖాస్తులను ఆన్ లైన్ లో సమర్పించాలన్నారు. దరఖాస్తులు పొందుటకు, ఇతర వివరములు నిమిత్తం ఆంధ్ర ప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ వెబ్ సైట్ https://apbragcet.apcfss.inలో పొందవచ్చునని APSWREI సొసైటీ కార్యదర్శి వి. ప్రసన్న వెంకటేష్ ఆ ప్రకటనలో కోరారు.

## తల్లి కూతురు ఆచూకీ లభ్యం




**పెడన మేజర్ న్యూస్ :** కుటుంబ కలహాల వల్ల తన కుమార్తెను తీసుకుని ఇంటి నుండి వెళ్లిపోయిన ఒక వివాహిత ఆచూకీ లభ్యమయిందని, వారిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్ఐ జి. సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధి కాకర్లమూడి గ్రామానికి చెందిన ఈడే దివ్య వివాహిత తన కుటుంబ కలహాల వల్ల మనస్థాపానికి గురై తన కూతురు వర్షిని తీసుకుని చెప్పా పెట్టకుండా ఇంటి వద్ద నుండి వెళ్లిపోయిందని ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి తన సిబ్బందితో రంగంలోకి దింపి సీసీ కెమెరాలు ద్వారా 24 గంటలలో ఆచూకీ తెలుసుకొని తల్లి బిడ్డను కుటుంబ సభ్యులకు అప్పగించామని అన్నారు. దీంతో ఎస్ఐను పలువురు ప్రశంసించారు.

## ఆదిరాజు సుబ్రహ్మణ్యం భౌతికయానికి ఎమ్మెల్సీ నివాళి



**నందిగామ, మార్చి 5, మేజర్ న్యూస్:** పట్టణంలోని నెహ్రూ నగర్లో కాకతీయ పాఠశాల ఉపాధ్యాయులు ఆదిరాజు సుబ్రహ్మణ్యం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి ఆయన భౌతిక గాయానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని శాసన మండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ తెలియజేశారు.

## విద్యుత్ బిల్లులు 15రోజుల గడువులో చెల్లించాలి.

**అవనిగడ్డ మేజర్న్యూస్ :** విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు 15రోజుల వ్యవధిలో చెల్లించాలని విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎమ్ సత్యానందం బుధవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు 15 రోజులు గడువు మాత్రమే బిల్లు ఇచ్చిన 15 రోజుల లోపల బిల్లు చెల్లించని యెడల తదుపరి నెలలో సర్ఛార్జ్ చెల్లించాలని వినియోగదారులు గమనించాలన్నారు. మీ విద్యుత్ బిల్లులు మొత్తం గడువు తేదీ మొదలైన సమాచారం మీకు సందేశాలను ముందుగానే పంపటం కొరకు మీ విద్యుత్ సర్వీస్కు జతపరచిన మొబైల్ నెం. సరిచూసుకోవాలన్నారు. మొబైల్ నెంబర్ తప్పుగా ఉండాలంటే మీవిద్యుత్ సెక్షన్ ఆఫీసర్ను సంప్రదించాలని మీ విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించి మెరుగైన సేవలు పొందాలన్నారు.

## శిరోమణికి 'ఉమెన్ ఆఫ్ ఎక్స్‌లెన్స్-2025' జాతీయ పురస్కారం



**గన్నవరం, మార్చి 5, మేజర్ న్యూస్ :** కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లి గ్రామానికి చెందిన హిందీ ప్రచారక్, సహజయోగ సాధకురాలు, ఎపి ఎన్ఆర్ఐ విభాగం ఉద్యోగి సగ్గుర్తి నాగశిరోమణి నారీరత్న 'ఉమెన్ ఆఫ్ ఎక్స్‌లెన్స్-2025' జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల తొమ్మిదోతేదీన విజయవాడ గాంధీనగర్‌లో జరిగే మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె పురస్కారాన్ని అందుకోనున్నారు. శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో నిపుణులైన మహిళలను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. శిరోమణి హిందీ ప్రచారక్‌గా గత 18 సంవత్సరాలుగా దక్షిణ భారత హిందీ ప్రచార సభ ద్వారా హిందీ పరీక్షలకు విద్యార్థినీ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. సహజయోగ ధ్యాన పద్ధతులను ఉచితంగా నేర్పించేందుకు తనవంతుగా కృషిచేస్తున్నారు. ముఖ్యంగా మహిళలకు సహజయోగం చేయటం ద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకునే పద్ధతులపై పాఠశాలలు, కళాశాలల కేంద్రంగా అవగాహనా సదస్సుల ద్వారా తెలియజేస్తున్నారు. సహజయోగ ధ్యానం కేంద్రం ద్వారా నిర్మల్ ఇంటర్నేషనల్ లీడర్స్ అకాడమీ (నీలా) ప్రోగ్రాంకు అనువాదకురాలిగా ఉన్నారు. ఎన్ఆర్ఐ విభాగంలో పనిచేస్తూ ఎందరో ప్రవాసాంధ్రులకు తమశాఖ ద్వారా సేవలు అందిస్తున్నారు. జాతీయ పురస్కారానికి ఎంపికైన నాగశిరోమణికి శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ అభినందనలు తెలిపారు.

## రాజకీయాల్లో నైతిక విలువలు జగన్‌లో లోపించాయి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రాజకీయాల్లో నైతిక విలువలే ఊపిరి అని తాజా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిలో అవి లోపించాయని కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బూరగడ్డ వేదవ్యాస్ జగన్ పై విరుచుకుపడ్డారు. బుధవారం వేద వ్యాస్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి 5 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసినా వారు బుధవారం పత్రిక సమావేశంలో పవన్ కళ్యాణ్ గురించి మాట్లాడిన భాష ఆయన స్థాయి దిగజారి మాట్లాడిన మాటలని అన్నారు. భాష అనేది అద్దం లాంటిదని, మనలోని సంస్కారాన్ని చాటి చెప్పుతుందని, అది పదిమందిని ఆకట్టుకునేదిలా ఉండాలని, బాధ పెట్టేదిలా ఉండకూడదని, బూరగడ్డ అన్నారు. పవన్ కళ్యాణ్ గురించి జగన్మోహన రెడ్డి రాజకీయంగా పరుషంగా మాట్లాడిన భాష తెలుగు ప్రజల్ని అవమానించినట్లేనన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో భారత రాజ్యాంగం ఏ వ్యక్తి అయినా ఎన్నికల్లో పోటీ చేసి గెలవడానికి అవకాశం కల్పించిందన్నారు. పవన్ కళ్యాణ్ తెలుగు సినీ రంగంలో తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకున్నారన్నారు. అయినా ప్రజాసేవ చేయాలనే సదుద్దేశంతో 2014 లో పార్టీ పెట్టి అప్పుడే ఎమ్మెల్యే, ఎం. పి. అయ్యే అవకాశం వచ్చినా అవి వదులుకొని 10 సంవత్సరాలు నిరంతరాయంగా పార్టీని నడిపి నేడు కూటమి ప్రభుత్వంలో భాగస్వాములయ్యారన్నారు. పవన్ కళ్యాణ్ తన చతురతతో కూటమిని ఏర్పాటు చేసి కేంద్రంలో, రాష్ట్రంలో కూడా కూటమి అధికారంలోకి వచ్చేటట్టు చేశారన్నారు. జగన్ ఆలోచించి సభ్యత గా మాట్లాడడం మంచిది అని హితవు పలుకుతున్నామన్నారు. ఇప్పటికే ఇలాంటి భాష మాట్లాడి, చాలా అధికారాలు కోల్పోయారన్నారు. మీ అనుచరులతో కలిసి అధికారంలో ఉండగా ఇలాంటి భాష మాట్లాడడం వల్లే అధికారాన్ని కూడా కోల్పోయారని వేదవ్యాస్ అన్నారు.

## సుబ్రహ్మణ్యేశ్వరునికి వెండి తొడుగు బహూకరణ



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** చల్లపల్లి శ్రీహరిహర పుత్ర అయ్యప్పస్వామి క్షేత్రంలోని ఉపాలయంలో శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి దాతలు వెండి తొడుగును బహూకరించారు. నంబూరి శ్రీనివాసరావు దంపతులు కిలో వెండిని అందచేయగా, యడవల్లి కృష్ణచైతన్య, కంచర్ల పాండురంగదాసు, పండమనేని విమల, కూరపాటి వెంకట రాజశేఖర్ లు మరో కిలో వెండిని అందచేశారు. రూ.రెండు లక్షల విలువైన వెండితో స్వామివారికి తొడుగును తయారుచేసి బుధవారం ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి ఆలయ కమిటీ పెద్దలకు అందచేశారు.

# పోటాపోటీగా సాగుతున్న మహిళా ఉద్యోగుల క్రీడా పోటీలు

**మానసిక ఆరోగ్యమే మహిళలకు బలం**

**ముఖ్య అతిథులుగా ఏపీ ఎన్జీజివో రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎ.విద్యాసాగర్**





**విజయవాడ మేజర్ న్యూస్ :** నిత్యం బాధ్యతలతో, కుటుంబ పరమైన ఒత్తిళ్లతో ఉండే మహిళా ఉద్యోగులకు ఆటపాటలు మానసిక ఉల్లాసాన్నిస్తాయని, మరింతగా బాధ్యతగా వ్యవహరించడానికి చురుకుగా పనిచేయడానికి కావలసిన శక్తినిస్తాయని అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఎన్జీజిఓ రాష్ట్ర మహిళా విభాగం నిర్వహిస్తున్న క్రీడలకు పెద్ద ఎత్తున మహిళా ఉద్యోగుల నుంచి స్పందన రావడం ఆనందంగా ఉందని ఏపీజేఏసీ చైర్మన్ ఏపీ ఎన్జీజీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి అన్నారు. స్థానిక గాంధీ నగర్ ఎన్జీజీవో హోంలో జరుగుతున్న రెండో రోజు ఉద్యోగుల ఆటలు పోటీల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా ఉద్యోగులకు మానసిక ధైర్యం, ఆహ్లాదకర జీవితం అవసరమని, ఆ శక్తిని ఇటువంటి కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా, సంఘం ద్వారా పొందుతారని తెలిపారు. మహిళా ఉద్యోగులకు సంబంధించిన అనేక సమస్యలను ఎన్జీజీవో సంఘం గతంలోనూ, ఇప్పుడు పరిష్కారం చేసిందని ఇక ముందు కూడా మహిళా ఉద్యోగులు స్వేచ్ఛగా మంచి వాతావరణంలో ఉద్యోగం చేసుకునేలా ఎన్జీజివో సంఘం కృషి చేస్తుందని తెలిపారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ కార్యాలయాల్లో ఎదుర్కొనే అనేక ఇబ్బందులు అధిగమించడానికి సంఘం వారికి తోడుగా ఉంటుందని తెలిపారు. ఎన్జీజీవో సంఘం నిర్వహిస్తున్న క్రీడోత్సవంలో భాగంగా రెండో రోజైన బుధవారం ఎన్జీజీవో హోంలో క్యారమ్స్, చెస్, వ్యాసరచన పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలలో వివిధ శాఖలకు సంబంధించిన మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. విజయవాడ దండుమూడి రాజగోపాల్ ఇండోర్ స్టేడియంలో జరిగిన షటిల్ బ్యాట్మెంటన్ క్రీడలను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ విద్యాసాగర్ ప్రారంభించారు. ఉద్యోగులు, ముఖ్యంగా యువతులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు. గురువారం నాటి కార్యక్రమంలో ఎన్జీజీవో హోంలో సాయంత్రం 6 గంటల నుండి పాటల పోటీలు, నృత్య పోటీలు నిర్వహిస్తున్నామని, అన్ని పోటీలు లాగానే వీటికి కూడా మహిళా ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని రాష్ట్ర మహిళా విభాగం చైర్మన్ నిర్మల కుమారి కన్వీనర్ మాధవి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకునే ముగింపు కార్యక్రమం ఈనెల 8న విజయవాడ ఎన్జీవో హోంలో జరిగే కార్యక్రమంలో విజేతలకు బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని తెలిపారు. సమావేశాన్ని జయప్రదం చేయాలని, ఈ సమావేశానికి బీసీ సంక్షేమ శాఖమాత్యులు సవిత, కమిషనర్ ఆఫ్ హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ రేఖ రాణి ఐఏఎస్, షరీన్ ఐపీఎస్ మహిళా విభాగం నాయకురాలు తదితరులు పాల్గొంటారని, మహిళా ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## మహిళలకు దేశంలో అన్ని రంగాల్లో పెద్దపీట

**రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు**



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** స్వాతంత్ర్యానంతరం మహిళలకు దేశంలో అన్ని రంగాల్లో పెద్దపీట వేసిందని కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు అన్నారు. మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఉమెన్ ఎంపవర్మెంట్ విభాగం ఆధ్వర్యములో నిత్యం మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యల పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు లో ఆయన పాల్గొని ప్రసంగించారు. 50 ఏళ్ల కిందటే భారత దేశాన్ని ఉక్కు మహిళ గా పేరుగాంచిన ఇందిరా గాంధీ సుదీర్ఘ కాలం పరిపాలించిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. దేశాన్ని సస్యశ్యామలం చేస్తున్న నదులను గంగా, యమునా,సరస్వతి, గోదావరి, కృష్ణా నదులను తల్లులుగా పూజించడం మన సంస్కృతికి నిదర్శనమన్నారు. ప్రముఖ ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ సాహితీ స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలు వాటికి పరిష్కారాలు గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం డా. సాహితీ ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆచార్యులు, సహాయ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**రానున్న ఎమ్మెల్సీ స్థానాలలో**

## ఒకటి దేవాంగులకు ఇవ్వాలి



**గూడూరు మేజర్ న్యూస్ :** రానున్న ఎమ్మెల్సీ స్థానాలలో ఒకటి దేవాంగులకు ఇవ్వవలసిందిగా కోరుతున్నాము రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం కార్యదర్శి పడవల మోహన్ త్రినాథ్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రాష్ట్రంలోని దేవాంగులకు రాజకీయంగా ఎలాంటి ప్రాధాన్యత లేదని కనీసం ఎమ్మెల్సీ ఒకటి అయినా ఇచ్చి దేవాంగుల అభ్యున్నతికి పాటుపడాల్సిందిగా కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాము అని పడవల మోహన్ త్రినాథ్ కోరారు.

**ఘనంగా శ్రీ సీతారామస్వామి వారి**

## దేవాలయ 16వ వార్షికోత్సవం



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మరివీధిలో వేంచేసియున్న శ్రీ సీతారామస్వామివారి దేవాలయ 16వ వార్షికోత్సవ వేడుకలను రెండు రోజుల పాటు ఘనంగా జరుపుకున్నారు. ఈ వార్షికోత్సవ వేడుకల్లో మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పాల్గొన్నారు. ఆలయంలో దేవతా మూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తి కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కృష్ణప్రసాదు ని ఘనంగా స్వాగతించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనము నవగ్రహపూజ, నవగ్రహ హోమం, రామ మూల మంత్ర హోమము, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలను రెండు రోజుల పాటు వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారికి హారతి ఇచ్చిన శాసనసభ్యులు కృష్ణప్రసాదు మాట్లాడుతూ అందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. జై శ్రీరామ్ అంటూ భక్తులు నినదించారు. గ్రామ పెద్దలు, కోదండ రామాలయ భక్తకమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 40 రోజుల ఉపవాస దీక్షలు ప్రారంభం



చల్లపల్లి మేజర్ న్యూస్ : చల్లపల్లి మండలం సాలిపేట ఆర్సీఎం చర్చిలో విభూది బుధవారం సందర్భంగా ఉపవాస దీక్షలు ప్రారంభమయ్యాయి. ఆర్సీఎం చర్చి ఫాదర్ బి.రవికుమార్ మాట్లాడుతూ, తపస్సుకాలంలో దానధర్మాలు, ప్రత్యేక ప్రార్ధనలు, ఉపవాసాలు అంశాలపై అనుసరించాల్సిన విధానాల గురించి వివరించారు. స్తుతి, కృతజ్ఞత, వినమ్రత, ఉపవాసం, పశ్చాత్తాప ప్రార్ధనలు గురించి తెలియచేశారు. ప్రతి శుక్రవారం సాయంత్రం చర్చిలో పరిశుద్ధ శిలువమార్గం, దివ్యసత్ప్రసాద ఆరాధన, దివ్యబలిపూజ, వాక్య పరిచర్య, ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దివ్యబలిపూజ, దివ్యసత్ప్రసాదం, పూజా కార్యక్రమాలు జరిగాయి. పలువురు విశ్వాసులు 40 రోజులు ఉపవాస దీక్షలను తీసుకున్నారు. దివిసీమలోని 12 గ్రామాల విశ్వాసులు, ఉపదేశకులు పాల్గొన్నారు.

# తహసీల్దార్ రైతు బజార్ తనిఖీ





**కంచికచర్ల ఫిబ్రవరి 5 మేజర్ న్యూస్ :** స్థానిక రైతు బజార్‌ను తహసీల్దార్ మానస బుధవారం తనిఖీ చేశారు. అధిక ధరలకు కూరగాయలు అమ్ముతున్నారని సమాచారం అందడంతో తహసీల్దార్ రైతు బజార్లో కొనుగోలుదారులను విచారించారు. వారు బోర్డు రేటుకే కొన్నామని తెలిపారు. అధిక ధరలకు కూరగాయలు అమ్మితే స్టాళ్లు రద్దు చేస్తామని నిర్వాహకులను హెచ్చరించారు. రైతు బజార్‌లోని స్టాళ్లు నిర్వాహకులు కొనుగోలుదారులతో మర్యాదగా



ప్రవర్తించాలని దురుసుగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయన్నారు. ఇక్కడి చెత్త ఎక్కడబడితే వేయకుండా పంచాయతీ వారు తీసుకు వెళ్ళటానికి అనుకూలమైన ప్రదేశంలో వేయాలని అన్నారు. కాటాలు తూనికల కొలతల వారిచే ధ్రువీకరణ పత్రం పొంది ఉన్నది లేనిది ఆరా తీశారు. ప్రతి సంవత్సరం తూనికల కొలతల వారిచే రెన్యువల్ పొందాలని లేనిచో కఠిన చర్యలు ఉంటాయన్నారు.ఎస్టేట్ అధికారి గదిలో రికార్డులు తనిఖీ చేశారు.

## నియోజకవర్గ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే యార్లగడ్డ



**గన్నవరం, మేజర్ న్యూస్ :** అసెంబ్లీ జీరో అవర్‌లో గన్నవరం నియోజకవర్గ సమస్యలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ సభ దృష్టికి తీసుకువచ్చారు. గత ప్రభుత్వంలో గన్నవరంలో అక్రమ మైనింగ్‌పై విచారణకు ఆదేశించారని... విచారణ పురోగతి ఏమిటో తెలియజేయాలని ఆయన కోరారు. ప్రస్తుతం గ్రావెల్ అందుబాటులో ఉండటం లేదని ఇసుక పాలసీ తరహాలో గ్రావెల్‌కు కూడా నూతన పాలసీ తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. గన్నవరం నియోజకవర్గానికి ఎక్కువ డీఎంఎఫ్ ఫండ్ కేటాయిస్తే, ప్రభుత్వం సహాయంతో సంబంధం లేకుండా అభివృద్ధి చేపట్టేందుకు వీలవుతుందని చెప్పారు. గన్నవరం విమానాశ్రయం వద్ద పచ్చదనాన్ని పెంపొందించాలని గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించినప్పటికీ, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. గన్నవరం విమానాశ్రయం నుండి హనుమాన్ జంక్షన్ వైపు 45 వేల చదరపు మీటర్లు గ్రీనరీ అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బెంగళూరు, చెన్నై విమానాశ్రయాలతో గన్నవరం పోటీపడాలంటే గ్రీనరీ అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే యార్లగడ్డ పేర్కొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు



**నందిగామ, మార్చి 5, మేజర్ న్యూస్:** ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఇన్చార్జి సిడిపిఓ కృష్ణకుమారి ఆధ్వర్యంలో నందిగామ మండలంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం, మాగల్లు లింగాలపాడు, నందిగామ సెక్టార్లలోని అంగనవాడి కేంద్రాల్లో హ్యాపీ ఉమెన్–హెల్తీ ఉమెన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం గర్భిణీలు బాలింతలకు అందజేసే సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సిడిపిఓ కృష్ణకుమారి పేర్కొన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలకు బరువు ఎత్తు, తల్లులకు పోషకాహార కిట్లను అందజేశారు చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల ప్రతి ఒక్కరు పరిపూర్ణ ఆరోగ్యం ఆనందాన్ని పొందవచ్చునని సూపర్వైజర్లు కరుణకుమారి వెంకట రావమ్మ తారబీ పేర్కొన్నారు. ఆయా కేంద్రాల్లో జరిగిన కార్యక్రమాల్లో అంగన్వాడి వర్కర్లు గర్భిణీలు బాలింతలు తల్లులు పాల్గొన్నారు.

## నేడు దేవాలయ అభివృద్ధి పనులకు భూమి పూజ



**నందిగామ, మార్చి 5, మేజర్ న్యూస్:** పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ శుక శ్యామలంబ సైత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో పలు అభివృద్ధి పనులకు గురువారం ఉదయం భూమి పూజ నిర్వహించనున్నట్లు ఆలయ అనువంశిక ధర్మకర్త వాసిరెడ్డి మురళి రాఘవ కుమార్ ఆలయ ఈవో గంగాధర్ తెలిపారు. దేవాదాయ శాఖ సి.జి.యఫ్ ఒక కోటి 30 లక్షలతో రామేశ్వర సోమేశ్వర భీమేశ్వర చంద్రమౌలేశ్వర ఉపాలయాలతో పాటు పలు అభివృద్ధి పనులకు భూమి పూజ జరుగుతుందని వారు తెలిపారు.

## నేడే గీత కులాల మద్యం షాపుల డ్రా



**కంచికచర్ల మార్చి 5 మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం గీత కులాలకు ప్రత్యేకంగా కేటాయించిన మద్యం షాపుల అప్లికేషన్ల డ్రా కలెక్టర్ అండ్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ ఎన్టీఆర్ జిల్లా వారిచే 06-03-2025 వతేది ఉదయం 10 గంటలకు గొల్లపూడి లోని మైలురాయి సెంటర్ వద్ద ఉన్న బీసీ సంక్షేమ భవన్ లో జరుగుతుందని కంచికచర్ల ఎక్సైజ్ సీఐ అశ్రపున్నిస్సాబేగం తెలిపారు. ఈ మద్యం షాపులకు అప్లై చేసిన వారు, వారి ఆధార్, ఎంట్రీ పాస్, ఒరిజినల్ క్యాస్ట్, సబ్ క్యాస్ట్ సర్టిఫికెట్స్,ఒరిజినల్ నేటివ్ సర్టిఫికెట్స్ తీసుకొని 9 గంటలకల్లా పై వేదిక వద్దకు రావాల్సిందిగా ఆయన తెలిపారు. ఏమైనా సందేహాలు ఉన్నట్లయితే ఇన్స్పెక్టర్ ఫోన్ నెంబర్లు 9440902460, 9989757977 లకు ఫోన్ చేసి తెలుసుకోగలరన్నారు.

## మైనర్లకు వాహనాలు అందిస్తే తల్లిదండ్రులదే బాధ్యత




**నందిగామ, మార్చి 5, మేజర్ న్యూస్:** మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులే బాధ్యత వహించాలని నందిగామ ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ అన్నారు బుధవారం స్థానిక మధిర రోడ్డులో ఇంటర్ విద్యార్థులు రాష్ డ్రైవింగ్ చేస్తూ త్రిబుల్ డ్రైవ్ ఏ కాకుండా నలుగురిని ఎక్కించుకొని ఒకే బైక్ పై రావడానికి గమనించిన ఆయన వెంటనే వారిని నిలువరించి వారికి పలు సూచనలు చేశారు. పలువురికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు నడిపిన, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన, ర్యాష్ డ్రైవింగ్ చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని సూచించారు మైనర్లకు వాహనాలు అందించే తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌కు రావాల్సి ఉంటుందని ప్రతిరోజు పరిశీలన చేస్తానని అన్నారు. కాలేజీలు నందిగామ పట్టణ పరిధిలోని పలు ప్రాంతాలలో గస్తీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా రూల్స్ అధికమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని తెలిపారు సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ హై స్కూల్‌లో పెయింటింగ్ పోటీలు



**నందివాడ, మేజర్ న్యూస్:** కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్, యొక్క ఆదేశాలపై గుడివాడ డిఎస్పీ ధీరజ్ వినీల్ మార్గదర్శకంలో,గుడివాడ రూరల్ ఇన్స్పెక్టర్ ఎస్ఎల్ఆర్. సోమేశ్వర రావు ఆధ్వర్యంలో నందివాడ ఎస్సై శ్రీనివాస్ సమన్వయంతో నందివాడ గ్రామ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో మహిళా దినోత్సవ వేడుకల పురస్కరించుకొని బుధవారం విద్యార్థుల కోసం పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మహిళల సాధికారత, హక్కులు, సమానత్వం వంటి కీలక విషయాలపై తమ అభిప్రాయాలను వ్యాస రూపంలో వ్యక్తపరిచారు. విద్యార్థులకు మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించి, సమాజంలో మహిళల పాత్ర, రక్షణ, హక్కుల గురించి అవగాహన కల్పించడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశ్యమని ఎస్ఐ శ్రీనివాస్ వివరించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళల రక్షణ కొరకు అభయ మహిళా రక్షక దళ సభ్యులు యొక్క సేవలు ఉపయోగించడం, అత్యవసర సమయంలో పోలీసులను సంప్రదించడానికి డయల్ 112 హెల్ప్ లైన్ నెంబరు వంటి విషయాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించామన్నారు. ఈ పోటీల విజేతలకు మార్చి 8 తేదీన పోలీస్ అధికారులు చేత ప్రత్యేక బహుమతులు ప్రదానం చేయబడుతుందని ఆయన తెలిపారు.





## గుడ్లవల్లేరు బస్‌షెల్టర్, టాయిలెట్స్ పరిశుభ్రతకు శ్రీకారం

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు పంచాయతీ ఏరియాలో పారిశుద్ధ్య చర్యలు ముమ్మరం చేసారు. గుడ్లవల్లేరు సెంటరులో అపరిశుభ్రంగా, అసౌకర్యంగా వుండి ప్రయాణీకులు, ప్రజలకు యిబ్బందికరంగావున్న బస్ షెల్టర్ ఆవరణ, అనుసంధానిత టాయిలెట్స్ వద్ద బుధవారం పారిశుద్ధ్య సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు. బస్ షెల్టరును శుభ్రపరచి, టాయిలెట్స్ వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించి, బ్లీచింగ్ చేసారు. ఈ సందర్భంగా కార్యదర్శి ఎజెఎల్ నరసిహారావు మాట్లాడుతూ ప్రధాన సెంటరులోని బస్ షెల్టర్, మంచినీటి బావి, జాతీయ నాయకుల విగ్రహాల వద్ద మరమ్మతులు నిర్వహించడం, టాయిలెట్స్ ఆధునీకరించడం, రంగులువేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్ది, పెద్దలు సదాశయంతో నిర్మించిన బస్ షెల్టర్ ప్రయాణీకులు, ప్రజలకు సౌకర్యవంతంగా వుండేలా, నిత్య పర్యవేక్షణకు సిబ్బందిని నియమించేలా, ఆహ్లాదకరమైన వాతావరణంలో బస్ షెల్టర్ ఏర్పాటుకు ప్రత్యేకాధికారులకు నివేదించి, సమ్మతితో చర్యలు చేపడతామని తెలిపారు.

## జిల్లా వైద్యాధికారి డా.శర్మిష్ఠ ఆధ్వర్యంలో..

# ఫోక్సో చట్టంపై అవగాహన సదస్సు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా వైద్యాధికారి కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి డా.శర్మిష్ఠ ఆధ్వర్యంలో చిన్నారులపై లైంగిక దాడులు నివారణపై క్షేత్రస్థాయి అధికారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎన్టీఆర్ జిల్లా ఆర్బీఎస్కే సైకాలజిస్ట్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మంచి స్పర్శ, చెడు స్పర్శ పై పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలియజేశారు. కృష్ణాజిల్లా ఆర్బీఎస్కే సమన్వయకర్త డా. హిమబిందు మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు బాలికలను లైంగికంగా వేధించినా, చిన్నారులపై అత్యాచారంతో పాటు మైనర్లపై దాడులకు పాల్పడే వారిపై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటారని తెలియజేశారు. ఆర్బీఎస్కే వైద్యాధికారి డా. శ్వేత మాట్లాడుతూ పుట్టుక నుండి 18 సంవత్సరాల లోపు మానసిక శారీరక లోపాలు కలిగిన బాలబాలికలకు ఆర్బీఎస్కేలో అందించే సేవలను గురించి వివరించి, ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికలు ఈ సేవలను వినియోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా చైల్డ్ వెల్ఫేర్ చైర్ పర్సన్ కె. సువార్త, డి పి వో సత్యవతి,జిల్లాలోని వివిధ మండల విద్యాధికారులు,ఐ సి డి యస్, ఆర్బీఎస్కే సిబ్బంది పాల్గొన్నారు.



## తాళ్లూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ

నందిగామ, మార్చి 5, మేజర్ న్యూస్: పట్టణంలోని దేవినేని వెంకటరమణ ఏరియా హాస్పిటల్ లో అన్ని విభాగాల్లోని రోగులకు 40 రోజులు పాటు అల్పాహారం పంపిణీ చేయనున్నట్లు తాళ్లూరు చారిటబుల్ ట్రస్ట్ యాజమాన్యం తాళ్లూరి అరుణ తెలిపారు.స్థానిక హాస్పిటల్‌లో అల్పాహారం పంపిణీ చేస్తామని మొదటి రోజు గోధుమ రవ్వ ఉప్మా, రాగి జావ, కోడిగుడ్డు వాటర్ ప్యాకెట్ ఇస్తున్నామన్నారు.రోజు కి ఒక వెరైటీ అల్పాహారం అన్ని విభాగాలు పేషెంట్లకు 50 మందికి ఇస్తామని తెలిపారు.మొదటి రోజు అల్పాహారాన్ని హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ వేపూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా అందించారు. తాళ్లూరు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంతో మందికి సహాయ సహకారాలు అందిస్తున్న తాళ్లూరి చారిటబుల్ ట్రస్ట్ వారికి హాస్పటల్ అభివృద్ధి కమిటీ తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అన్నారు.ఈ కార్యక్రమంలో హాస్పటల్ సూపరిండెంట్ సత్యనారాయణ,డాక్టర్లు, హాస్పటల్ సిబ్బంది తాళ్లూరి పెట్రోల్ బంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆలపాటిని కలసి శుభాకాంక్షలు తెలిపిన ఎన్ఆర్ఐ బొబ్బా



అవనిగడ్డ, మేజర్ న్యూస్ : ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా అఖండ మెజారిటీతో విజయం సాధించిన ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను ఎన్నారై పారిశ్రామికవేత్త, సీనియర్ తెలుగుదేశం నాయకులు బొబ్బా గోవర్ధన్ కలసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యావేత్త అయిన రాజేంద్ర ప్రసాద్ కు పట్టభద్రులు ఆశలు, ఆకాంక్షలు తెలిసిన వ్యక్తి అని వారి ఆకాంక్షలను శాసన మండలిలో వినిపించాలని గోవర్ధన్ ఆశాభావం వ్యక్తం చేశారు.. పార్టీ విజయం కోసం అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నేతలు చేసిన కృషిని ఈ సందర్భంగా గోవర్ధన్ ఆలపాటికి వివరించారు.

## వేసవికాలంలో తాగునీటి ఎద్దడి ఉండకూడదు

### విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ : వేసవికాలంలో ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా కృష్ణలంక ప్రాంతంలో గల 20, 21, 22 డివిజన్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మెట్ల బజార్ చివరనున్న బోరు పంపు పరీక్షించారు, వేసవికాలంలో ప్రజలకు త్రాగునీటి సరఫరా లో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని అధికారులందరూ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రస్తుతం ఉన్న త్రాగునీటి బోర్లు పనిచేస్తున్నాయా లేదా వంటి విషయాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. కృష్ణలంకలోని స్వర్ణపురి ప్రాంతం మొత్తం పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, ప్రజలకు అవసరమైన వసతులన్నీ కల్పించాలని, ప్రాంతం మొత్తం పరిశుభ్రంగా ఉంచాలని, ఘాట్లను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఏవైనా మరమ్మతులు ఉన్నచో వెంటనే రిపేరు చేయించి త్వరలో పూర్తిస్థాయిలో అందుబాటులో తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కృష్ణలంక డ్రైనేజ్ పంపింగ్ స్టేషన్ ను పరిశీలించారు అక్కడ జరుగుతున్న రేనోవషన్ పనులను సత్వరమే పూర్తి చేయాలని, ప్రాంగణం మొత్తం పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. తదుపరి ఏపీఎస్ఆర్ఎం స్కూల్ వద్దగల అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. అధికారులు అందరూ ప్రతి రోజు అన్న క్యాంటీన్ ను పరిశీలించాలని, ఎటువంటి మరమ్మతులు ఉన్న వెంటనే సరి చెయ్యాలని, ఆహార నాణ్యతలో ఎటువంటి లోపం ఉండరాదని, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని, అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరిండెంటింగ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్ ) పి. సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, బయాలజిస్ట్ సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కల్పన, వేతన లక్ష్యాలను చేరుకోవాల్సిందే..



పథకం లక్ష్యం పూర్తిస్థాయిలో నెరవేరేలా అధికారులు, సిబ్బంది కృషిచేయాలి

క్షేత్రస్థాయి అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలి

ఉపాధి హామీ పనులపై కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, మార్చి 5, మేజర్ న్యూస్ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలోని అన్ని మండలాల్లో, గ్రామాల్లో వేతనదారులకు పని కల్పించడంలోనూ, దినసరి వేతనం రూ. 300 వచ్చేలా చూడటంలోనూ నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా చేరుకోవాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్ నుంచి డ్వామా అధికారులతో కలిసి ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బందితో వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు తీరుతెన్నులతో పాటు సగటు రోజువారీ వేతనాలు, గ్రామాల వారీగా వేతనదారుల హాజరు, వారికి అందుతున్న వేతనం తదితరాల్లో పురోగతిని సమీక్షించారు. సగటు వేతనం విషయంలో పరిస్థితి మెరుగుపడిందని.. వీలైనంత ఎక్కువ మందికి పని కల్పించడంలో పురోగతి చూపాలన్నారు. రోజుకు సగటున రూ. 300 పొందే హక్కు వేతనదారులకు ఉందని.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. వీలైనంత ఎక్కువ మందికి పని కల్పించాలని, పథకం కింద చేపట్టేందుకు గ్రామాభివృద్ధి, వ్యక్తిగత, సామాజిక పనులను గుర్తించాలని సూచించారు. వేసవి నేపథ్యంలో ఉదయాన్నే పనులు ప్రారంభమయ్యేలా చూడాలని.. వేతనదారులకు తాగునీరు అందుబాటులో ఉంచేలా చూడాలని ఆదేశించారు. ఉపాధి పనులపై ప్రతివారం జిల్లాస్థాయిలో సమీక్ష చేస్తున్నామని.. ఇదేవిధంగా ఎంపీడీవోలు మండలస్థాయిలో సమావేశాలు నిర్వహించాలని, క్షేత్రస్థాయి సిబ్బందికి దిశానిర్దేశం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సమావేశంలో డ్వామా పీడీ ఎ.రాము, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, సీపీవో వై.శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ళలో దొంగతనాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన



విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ : సమాజంలో వివిధ రకాల నేరాలు జరుగుతూ ఉంటాయి, నేరాలు జరిగిన తరువాత దర్యాప్తు చేసేకంటే, అవి జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా, ప్రయాణం చేయు సమయంలో ఏమరపాటుగా ఉండటం వలన జరిగే నేరాల గురించి అవగాహన కల్పించడం ద్వారా నేరాలకు అడ్డుకట్ట వేయాలనే ప్రధాన ఉద్దేశ్యంతో పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాల మేరకు క్రైమ్ డీసీపీ, కే.తిరుమలేశ్వర రెడ్డి ఐ.పి.ఎస్.,, క్రైమ్ ఏడీసీపీ ఎం. రాజా రావు పర్యవేక్షణలో సి.సి.ఎస్. ఇన్స్పెక్టర్లు వారి సిబ్బందితో కలిసి నగరంలోని ముఖ్య ప్రదేశాలలో, అపార్ట్మెంట్లు లోని ప్రజలకు దొంగతనాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం సమయంలో కృష్ణ లంక పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్.కె.రెసిడెన్సీ లోని ప్రజలకు ఏ. డి. సి. పి. క్రైమ్ రాజారావు ఆధ్వర్యంలో సౌత్ డివిజన్ ఇన్స్పెక్టర్ అబ్దుల్ సలాం సమావేశం ఏర్పాటు చేసి, దొంగతనాలు ఏవిధంగా జరుగుతాయి, నేరాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి, పోలీస్ కమీషనర్ ప్రవేశపెట్టిన ఈ-పహారా గురించి, డైయల్ 100, 112, 1930, ఎల్.హెచ్.యం.యస్. యాప్ వలన కలిగే ఉపయోగాలు గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ అబ్దుల్ సలాం సమావేశంలోని ప్రజలతో మాట్లాడు తూ, సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న నేరాల గురించి, డిజిటల్ అరెస్ట్ మొదలగు అంశాల గురించి,అపార్ట్మెంట్ చుట్టుపక్కల ప్రదేశాలు మొత్తం సి.సి. కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఊరు వెళ్ళే సమయంలో తప్పని సరిగా లోకల్ పోలీస్ వారికి సమాచారం అందించాలని, ఎల్.హెచ్.యం.యస్. యాప్‌ను ఉపయోగించుకోవాలని, దీని వలన ఎవరైనా దొంగ ఇంటి లోనికి వస్తే వెంటనే అలారం మోగడం తోపాటు సమీపంలోని పోలీస్ స్టేషన్ కు సమాచారం చేరి దొంగలను పట్టుకోవచ్చు, దొంగతనం జరగకుండా చూడవచ్చని, మీ దగ్గర ఉన్న విలువైన వస్తువులను లాకర్స్‌లో పెట్టుకో వాలని, పోలీస్ కమీషనర్ ప్రత్యేకంగా ఈ పహారా యాప్ ద్వారా బీటు పోలీస్ వారికీ త్వరితగతిన సూచనలు అందించడానికి ఉపయోగపడుతుందని వివరించారు.

# సేవా దృక్పథంతో సిద్ధార్థ అకాడమీ అందిస్తున్న సేవలు హర్షణీయం





పమిడిముక్కల మార్చి 5 మేజర్ న్యూస్ : సేవా దృక్పథంతో, సమాజాభివృద్ధి ధ్యేయంతో సిద్ధార్థ అకాడమీ పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడం హర్షణీయమని పామర్రు శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. విజయవాడ సిద్ధార్థ అకాడమీ ఆధ్వర్యంలో ఉయ్యూరులో నడుస్తున్న ఏజీ అండ్ ఎస్ జి సిద్ధార్థ కళాశాల ఆధ్వర్యంలో తాడంకి లోని జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం సాయంత్రం విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కుమార్ రాజా మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పేద విద్యార్థులను ఆదుకునేందుకు అటు విద్యాపరంగానూ ఇటు ఆర్థికంగానూ సహకారం అం దిస్తున్న సిద్ధార్థ అకాడమీ సేవలు మరువలేనివి అన్నారు. అటువంటి కళా శాలలో చదువుతున్న విద్యార్థులు ఎంతో అదృష్టవంతులని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం లక్షలాది రూపాయలను పేద విద్యార్థులకు ఉపకార వేతనాలుగా అందిస్తూ వారు చేస్తున్న సమాజసేవ మర్చిపోలేనిదన్నారు. ఏడాది కూడా కళాశాల పరిధిలో 91 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడం హర్షణీయమన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ చదివే విద్యార్థులకు ఈ ఉపకార వేతనాలు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం అందించే తల్లికి వందనం, ఫీజు రియంబర్స్మెంట్ పథకాల ద్వారా వచ్చే నగదుతో విద్యార్థులకు ఉచితంగా విద్యాబోధన చేస్తున్నారన్నారు. జీవితాన్ని సమర్థవంతంగా మలుచుకోవడానికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలను విద్య అందిస్తుందని, దీనిని విద్యార్థితో అవగాహన చేసుకుని ఆ దిశగా తమ ఉన్నతికి బాటలు వేసుకోవాలని సూచించారు. విద్యావంతులైన వ్యక్తులకు ఆర్థిక స్థిరత్వం, జీవిత పురోగతికి ఎక్కువ అవకాశం ఉంటుందన్నారు సిద్ధార్థ ఫౌండేషన్ వార్షిక ఉపకార వేతనాలను అందించిన సిద్ధార్థ అకాడమి కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు ను ఎమ్మెల్యే కుమార్ రాజా ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. విశ్వనాథ్, జూనియర్ కళాశాల డైరెక్టర్ వినయ్ కుమార్, పాలడుగు రామచంద్రరావు, కళాశాల ప్రత్యేక అధికారి సత్యనారాయణ, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైయస్సార్ ప్రసాద్, జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జ్ తాడిశెట్టి నరేష్, పాఠశాల అభివృద్ధి కమిటీ సలహాదారు జక్కా శ్రీనివాసరావు, కళాశాల అధ్యాపకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# బుడమేరు గండ్లను శాశ్వతంగా పూడ్చాలి

**జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసింది**

**విజయవాడ వరదముంపును అందరూ వీక్షించారు**

**లేకుంటే రాబోయే కాలంలో ఇబ్బందులు తప్పవు**

**వేలాది ఎకరాల ఆయకట్టు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది**

**తక్షణమే బుడమేరు ఆధునికీకరణ పనులు చేపట్టాలి**

**శాసనసభలో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు విజ్ఞప్తి**



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** బుడమేరు ఆధునికీకరణ పనులు యుద్ధప్రాతి పదికన చేపట్టి, శాశ్వతంగా గండ్లను పూడ్చాలని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఎమ్మెల్యే కృష్ణప్రసాదు బుధవారం మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఏ రంగాన్ని చూసినా పూర్తిగా నిర్వీర్యం అయిందన్నారు. ఈ విషయం సభ్యులందరు చెప్పారని అన్నారు. ముఖ్యంగా సాగునీటి రంగం చాలా ఇబ్బందులకు గురైన విషయం అందరికీ తెలిసిన విషయమే అన్నారు. ఈ బడ్జెట్లో సాగునీటి రంగానికి రూ.17 వేల కోట్లకు పైగా కేటాయించారని అన్నారు. గత ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో వచ్చిన అకాల వర్షాలకు బుడమేరు వల్ల సంభవించిన వరదలు, విధ్వంసం కారణంగా సామాన్య జనజీవనం స్తంభించి, రైతులు, ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు.బుడమేరు 75 శాతం మైలవరం నియోజకవర్గంలో ఉందన్నారు. గత ఏడాది అకాల వరదల ధాటికి మైలవరం నియోజకవర్గంలో 60కి పైగా చెరువుల కట్టలు తెగిపోయాయన్నారు. బుడమేరుకు అనుబంధంగా ఉన్న దాదాపు వాగులు అన్నీ చాలా చోట్ల ధ్వంసం అయ్యాయన్నారు. అప్పట్లో సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేష్, నిమ్మల రామానాయుడు స్వయంగా పర్యవేక్షించి, ప్రధాన గండ్లను మాత్రమే పూడ్చారని అన్నారు. కానీ ఇంకా మైలవరం నియోజకవర్గంలో 160 చోట్ల గండ్లను శాశ్వత ప్రాతిపదికన పూడ్చివేసి, మరమ్మతులు చేయాల్సి ఉందన్నారు.

గత ఏడాది కురిసిన వర్షాలకు 35 నుంచి 40 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయిందన్నారు. వరద నీటి ఉధృతి ఒక్కసారిగా పెరిగి ఆ నీరు అంతా ఒక్కో చెరువు నుంచి కట్టలు తెగుతూ కిందకు ప్రవహించి ఎన్నో చెరువుల కట్టలు తెగి దిగువకు ప్రవహించిందన్నారు. ఇప్పటికీ పూర్తి స్థాయిలో చెరువులకు మరమ్మతులు చేపట్టలేదన్నారు. భవిష్యత్తులో కేవలం 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయినా గతానికి మించిన విధ్వంసం జరిగే అవకాశం ఉందన్నారు.

అప్పట్లో చెరువులకు తాత్కాలికంగా మరమ్మతులు మాత్రమే చేశా రని, ఈ బడ్జెట్లో నిధులు కేటాయించినందున శాశ్వతంగా మరమ్మతులు చేయాలన్నారు. 2014 నుంచి 2019 మధ్య టీడీపీ హయాంలో రూ.206 కోట్లతో బుడమేరు ఆధునికీకరణ పనులు చేపట్టారన్నారు. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ పనులు పక్కన పెట్టిందన్నారు. అప్పట్లో తను పలుసార్లు దీనిపై విజ్ఞాపన పత్రాలు ఇవ్వగా పాలనా పరమైన అనుమతి ఇచ్చి, కేవలం రూ.20 కోట్ల పనులు మాత్రమే పూర్తి చేసిందన్నారు.గత వరదల వల్ల కలిగిన భారీ నష్టానికి కూడా బుడమేరు ఆధునికీకరణ జరగక పోవడం కూడా కారణం అన్నారు. జగన్మోహన్ రెడ్డి కూడా అప్పట్లో బుడమేరు ఆధునికీకరణ పనులు చేపట్టకుండా గత ఏడాది వల్ల జరిగిన విధ్వంసానికి కారకుడయ్యారని అన్నారు. సీఎం చంద్రబాబు స్వయంగా బుడమేరు వరద బాధితులకు అండగా నిలబడబట్టే బెజవాడ ప్రజలు కొద్ది రోజుల వ్యవధిలోనే సాధారణ స్థితికి వచ్చారని అన్నారు. బుడమేరు ఆధునీకీకరణకు నిధులు కేటాయించి తక్షణమే పనులు చేపట్టకపోతే రాబోయే వర్షాకాలంలో భారీ వర్షాలు సంభవిస్తే మళ్ళీ బెజవాడ మునిగిపోయే అవకాశం లేకపోలేదన్నారు. వందలాది ఎకరాల ఆయకట్టు మునిగిపోయే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా మైలవరం నియోజకవర్గంలో బుడమేరు, పులివాగు, కోతులవాగులు కూడా గండ్లు పడిన చోట మళ్లీ పొలాలు మునిగిపోయే అవకాశం ఉందన్నారు. డెల్టాకు నీరు అందించే పట్టిసీమ ప్రాజెక్టు నీళ్లు విడుదల చేసినా పొలాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందన్నారు. తక్షణమే ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు కోరారు.

## ఎన్నికలకోడ్ ముగిసిన విగ్రహాల ముసుగులు తొలగలేదు



**అవనిగడ్డ మేజర్‌న్యూస్ :** ఎమ్ఎల్సి ఎన్నికలు ముగిసినా విగ్రహాల ముసుగులు తొలగలేదు. ఎమ్ఎల్సి ఎన్నికల కోడ్ ముగిసి మూడురోజులు అయినప్పటికి రాజకీయనాయకులకువేసిన ముసుగులు తొలగలేదు. దివిసీమ గాంధీగా పేరొందిన మండలి వెంకట కృష్ణారావువిగ్రహాన్ని పులిగడ్డ టోల్‌గేట్ వద్ద ఏర్పాటు చేయగా ఎమ్ఎల్సి ఎన్నికల కోడ్ పేరుతో పంచాయితీ అధికారులు ముసుగులు వేశారు. కోడ్ ముగిసి మూడు రోజులు అయినప్పటికీ దివిసీమలో దివిసీమ గాంధీ విగ్రహంతో పాటు పలు విగ్రహాలు నేటికీ ముసుగులోనే ఉన్నాయి. సంబంధించిన అధికారులు వెంటనే స్పందించి ముసుగులు తొలగించాలని పలువురు బహిరంగంగానే కోరుతున్నారు.

## అనుమతులు లేకుండానే చెరువులు త్రవ్వకం



**అవనిగడ్డ మేజర్‌న్యూస్ :** కోడూరు మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామపంచాయితీ ఏరియాలో షుమారు 80ఎకరాలకుపైబడి ఎడబ్బడి భూములలో గత మూడురోజులుగా రాత్రి పగలు అనుమతులు ఏమీ లేకుండా చెరువులు త్రవ్వుతున్నారు. రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తికూడా చూడటం లేదని గ్రామస్తులు ఆందోళన పడుతున్నారు. రెవెన్యూ అధికారులు రిజిస్ట్రేషన్ భూములలో చెరువులు త్రవ్వాలంటే అనుమతుల కోసం రైతులను పలురకాల ఇబ్బందులకు గురిచేస్తారు. అటువంటిది 4. 5 ప్రొక్లెయిన్‌లతో బహిరంగంగా చెరువులు త్రవ్వుతున్న పెద్ద విస్తీర్ణంలో త్రవ్వకాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనుమతులు లేకుండా చెరువులు త్రవ్వితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సూచనలు చేసే రెవెన్యూసిబ్బంది అనుమతులు లేకుండా త్రవ్వకాలు జరిపిన వారిపై ఏవిధమైన చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

## వైభవంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు



**అవనిగడ్డ మేజర్‌న్యూస్ :** విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మండల పరిధిలోని వేకనూరు గ్రామంలో గ్రామస్తుల సహకారంతో 60లక్షల రూపాయల వ్యయంతో వేణుగోపాల స్వామి ఆలయాన్ని నూతనంగా నిర్మించారు. ఆలయంలో ఈ నెల 4వ తేదీ మంగళ వారం నుండి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. మహోత్సవాలలో భాగంగా రెండవరోజైన బుధవారం అగ్ని ప్రతిష్టా మహోత్సవ క్రతువులు నిర్వహించి రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్లను గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వాస్తు సిద్ధాంతి పాకలపాటి రామచంద్రరావు పర్యవేక్షణలో దివి వెంకట ఫణికృష్ణమాచార్యుల బ్రహ్మత్వంలో 6వతేదీ గురువారం ఉదయం 11గ॥45నిమిషాలకు విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు జరుగుతాయని అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమం జరుగుతుందని కావున భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## జగన్‌మోహన్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకో

**అవనిగడ్డ మేజర్‌న్యూస్ :** రాజకీయాలలో నైతికవిలువలే ముఖ్యమని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిలో అవి లోపించాయని ఐదు సంవత్సరాల ముఖ్యమంత్రిగా పనిచేసిన బుధవారం పత్రికా సమావేశంలో పవన్‌కళ్యాణ్ గురించి మాట్లాడిన భాష ఆయన స్థాయి దిగజారి మాట్లాడటం చాలా బాధాకరమని భాష అనేది అద్దం లాంటిదని మనలోని సంస్కారాన్ని చాటి చెప్పుతున్నదని అది పదిమందిని ఆకట్టుకునేలా ఉండాలని బాధ పెట్టేలా ఉండకూడదని ఉమ్మడి కృష్ణాజిల్లా జనసేన అధికార పార్టీ ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు అన్నారు. ఆయన బుధవారం విలేఖరులతో మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి పవన్‌కళ్యాణ్ గురించి రాజకీయంగా మాట్లాడిన భాష తెలుగు ప్రజల్ని అవమానపరిచే విధంగా ఉందన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో భారతరాజ్యాంగం ఏవ్యక్తి అయినా పోటీచేసి గెలవడానికి అవకాశం కల్పించిందన్నారు. ఇప్పటికైనా మాజీ ముఖ్యమంత్రిగా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడిన భాషకు జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఉపముఖ్య మంత్రి పవన్‌కళ్యాణ్‌కు క్షమాపణ చెప్పాలని జనసేన పార్టీతరపున రాయపూడి డిమాండ్ చేశారు.

అడవి ఆవుల బారి నుంచి

## రైతాంగ పంటలను ఆదుకోండి

**ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**



**నందిగామ, మార్చి 5, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలలో బుధవారం ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ నియోజకవర్గంలోని చందర్లపాడు మండల ప్రాంతంలో నది పరివాహక గ్రామాల లంక పొలాలలో ఎక్కువగా అడవి ఆవులు సంచరిస్తున్నాయని పగటి వేళలలో విశ్రాంతి తీసుకుంటూ రాత్రి వేళలలో చిన్న సన్నకారు రైతులు సేద్యం చేస్తున్న పంట పొలాలపై గుంపులు గుంపులుగా పడి పంటలను నాశనం చేస్తున్నాయని, ఈ అడవి ఆవులు సాధారణ ఆవులు కన్నా చాలా భారీగా ఉంటాయని. రాత్రి వేళల్లో వీటిని కట్టడి చేయడానికి ఇబ్బందికరమైన పరిస్థితులు ఉన్నాయని ఒకరు లేదా ఇద్దరు ముగ్గురు వ్యక్తులు కలిసి వీటి వద్దకు వెళ్లడానికి సాహసం చేసే పరిస్థితి లేదని గుంపులుగా ఉన్న ఈ ఆవులు మనుషులపై దాడికి తెగబడుతూ వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం కూడా ఉందని తెలియజేశారు. ఈ అడవి ఆవుల గుంపుల నుంచి పంట పొలాలను రక్షించుకొనుటకు రైతాంగం పొలం చుట్టూ ఫెన్సింగ్ వేసుకునే పరిస్థితి ఉందని అది కూడా ఆర్థిక స్తోమతతో కూడిన పని అయిన, ఫెన్సింగ్ వేసిన అడవి ఆవులు వాటిని కూడా ధ్వంసం చేస్తున్నాయని శాసనసభలో ప్రస్తావిస్తూ ఈ విషయాన్ని సంబంధిత మంత్రి దృష్టికి తీసుకువెళ్లి తక్షణమే వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## కూచిపూడి అభివృద్ధికి సహకరించండి

**ఎమ్మెల్యే కుమార్ రాజా**



**పామర్రు మార్చి 5 మేజర్ న్యూస్ :** పురాతన నాట్య కళ అయిన కూచిపూడి నాట్య అభివృద్ధికి తగువిధంగా ప్రభుత్వం సహకారం అందించాల్సిన అవసరం ఉందని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. బుధవారం అసెంబ్లీలో జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్లో పర్యాటక, సాంస్కృతిక రంగాలకు 269 కోట్లు కేటాయించడం హర్షణీయం అన్నారు. ప్రఖ్యాతిగాంచిన కూచిపూడి నాట్యకళకు పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకారం అందించాలని కోరారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో కూచిపూడిలో అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పూర్తి సహకారం అందించారన్నారు. గత ఐదు సంవత్సరాల కాలంలో కూచిపూడిని అసలు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కూచిపూడిలో ప్రవాసాంధ్రుల సహకారంతో ఏర్పాటు చేసిన సంజీవని వైద్యశాలకు కూడా గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పూర్తి సహకారం అందించారని, అయితే ప్రస్తుతం ఆసుపత్రి పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందలేదు అన్నారు. కొంత మేరకు ఆధునిక పరికరాలు ఉన్నప్పటికీ సరైన వైద్యులు లేక వైద్య సేవలు సక్రమంగా అందడం లేదన్నారు. ఈ విషయాలను గమనించి కూచిపూడి అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి ఆదుకోవాలని ఎమ్మెల్యే కుమార్ రాజా కోరారు. గత డిసెంబర్ నెలలో కూచిపూడి లో ఒకేసారి మూడువేల మంది చేసిన బృంద నాట్యాన్ని ఉపసభాపతి రఘురామ కృష్ణం రాజు, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ జిల్లా మంత్రి కొల్లు రవీంద్ర కూడా తిలకించారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అలాగే ఆ సమయంలో సాంస్కృతిక శాఖామాత్యులు కందుల దుర్గేష్ కూచిపూడి అభివృద్ధికి తన వంతు సహకారాన్ని పూర్తిస్థాయిలో అందిస్తానని హామీ ఇచ్చారని కూడా ఎమ్మెల్యే కుమార్ రాజా గుర్తు చేశారు.

## గాజుల లంకేశ్వరమ్మ మృతి



**అవనిగడ్డ మేజర్‌న్యూస్ :** వైఎస్ఆర్‌సిపి నాయకులు అవనిగడ్డ మాజీ పంచాయితీ ఉపసర్పంచ్ గాజుల జయగోపాల్ మాతృమూర్తి లంకేశ్వరమ్మ (58) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు అవనిగడ్డ, పులిగడ్డ సర్పంచ్‌లు గొరుముచ్చు ఉమ, విజయకుమార్, ఎంపిపి తుంగల సుమతి, జడ్‌పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ వైస్ ఎం.పి.పి పులిగడ్డ పిచ్చేశ్వరరావు, అవనిగడ్డ ఉపసర్పంచ్ కోడూరు సత్యన్నారాయణలతో పాటు పంచాయితీ పాలక వర్గ సభ్యులు, పంచాయితీ ఇన్‌ఛార్జ్ కార్యదర్శి అనితలతో పాటు పలువురు గ్రామ ప్రముఖులు తదితరులు బుధవారం లంకేశ్వరమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు. మృతి చెందిన లంకేశ్వరమ్మకు భర్త, ఇరువురు కుమార్తెలు, కుమారులు ఉన్నారు.

# లేపాక్షి క్లియరెన్స్ సేల్‌ను వినియోగించుకోండి





### పండుగల సందర్భంగా ప్రత్యేక డిస్కౌంట్లు

**విజయవాడ, మేజర్ న్యూస్ :** దేశవ్యాప్తంగా ఎంతోమంది హస్త కళాకారుల చేతిలో రూపుదిద్దుకున్న అద్భుతమైన కళాఖండాలపై లేపాక్షి వార్షిక క్లియరెన్స్, ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా ప్రత్యేకమైన డిస్కౌంట్లతో వినియోగదారులు కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ సంస్థ లేపాక్షి హ్యాండీ క్రాఫ్ట్ అమ్మకాలు ప్రారంభించిందని లేపాక్షి మేనేజర్ ఎం. సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్ లోని షో రూమ్ లో హస్తకళ వస్తువులు, చేనేత వస్త్రములపై 10 నుంచి 50 శాతం తగ్గింపు ధరలతో కళా కృతులు కొనుగోలు చేసేందుకు, హస్త కళాకారులకు ఉపాధి కల్పించేందుకు వచ్చిన ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొండపల్లి, ఏటికొప్పాక, ఉడ్ కార్వింగ్ కళా రూపాలు, చేనేత వస్త్రాలు, మంగళగిరి కాటన్, కలంకారి వస్త్రములపై ప్రత్యేక తగ్గింపు ధరలో కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఏ.పి. హెచ్.డి.సి. మేనేజింగ్ డైరెక్టర్ ఎం.విశ్వ ఆదేశాల మేరకు ప్రత్యేక కలెక్షన్లతో ఈ క్లియరెన్స్ సేల్ వినియోగదారులకు ఒక మంచి షాపింగ్ అనుభూతిని కలగజేస్తుందన్నారు మార్చి 31 వరకు తగ్గింపు ధరలో విక్రయాలు ఉంటాయని తెలిపారు.

మరెక్కడా లభించని అరుదైన కళాకృతుల కొనుగోలుకు కళారాధకులు, వినియోగదారులు తమ అభిరుచులకు అనుగుణంగా కోరుకునే ప్రతి కళాకృతి వినియోగదారులను ఆకట్టుకునేలా ఉంటుందన్నారు. కళాత్మక అభిరుచులు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మేనేజర్ సురేష్ కోరారు.

## 6న గుడ్లవల్లేరు ఫార్మసీ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** స్థానిక గుడ్లవల్లేరులోని వి వి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల వారు అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెషనల్(ఏపిపి) వారి అనుసంధానంతో ఈ నెల 6 వ తేదీన అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సు "గ్లోబల్ సినారియో అండ్ ఫ్యూచర్ ప్రాస్పెక్ట్స్ ఆఫ్ డ్రగ్ డిజైన్ ఇన్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్" అనే అంశంపై నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. లక్ష్మణరావు తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ రాజీవ్ దహియా, ప్రెసిడెంట్, ఏపీపీ., గౌరవ అతిథిగా డాక్టర్ సి వి సురేష్, వైస్ ప్రెసిడెంట్ ఏపీపీ., రిసోర్స్ పర్సన్‌గా ప్రొఫెసర్ కే ఎన్ వి రావు ప్రిన్సిపాల్ నలంద ఫార్మసీ కళాశాల వ్యవహరించనున్నారు. ఈ సదస్సుకు వివిధ కళాశాలల నుండి అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు దాదాపు 450 మంది డెలిగేట్స్ పాల్గొననున్నారని కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణరావు. తెలిపారు. ఈ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణలో కళాశాల ప్రిన్సిపాల్ తో పాటు విభాగాధిపతులు డాక్టర్ ఎస్ కే అమీనాభి, డాక్టర్ పి రవిష, డాక్టర్ టి ప్రశాంతి, డాక్టర్ టి బాలకృష్ణ,, బి సత్య శ్రీ పాల్గొన్నారు. ఈ సదస్సు కోఆర్డినేటర్‌గా డాక్టర్ పి.రవిష వ్యవహరిస్తున్నారు.




### పంచాయతీ కార్యాలయంలో
## చలివేంద్రం ఏర్పాటు

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి.కొండూరు గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని సర్పంచ్ మండల అరుణ చేతుల మీదగా ప్రారంభించారు. ఈ మూడు మాసాలు అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయని అధికారులు హెచ్చరించడంతో ప్రజల శ్రేయస్సు దృష్ట్యా చలివేంద్రాన్ని ఏర్పాటుచేసి మంచినీటి సరఫరా కోసం ప్రత్యేకంగా ఒక మనిషిని నియమించారు. ఎదురుగా బస్ స్టాప్ ఉండటం తో నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంత ప్రజలు పంచాయతీ కార్యాలయంలో శ్వేద తీర్చుకుంటారు వేసవిని దృష్టిలో పెట్టుకొని పంచాయతీ కార్యాలయంలో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వై.బసవలింగేశ్వర, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సకాలంలో పన్నులు చెల్లించండి

### కమిషనర్ రమణబాబు



**నందిగామ, మార్చి 5, మేజర్ న్యూస్:** ఇంటి పన్నులు, నీటి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు, వ్యాపార లైసెన్సులు, ప్రకటన ఛార్జీలు చెల్లింపు చేయవలసినదిగా నందిగామ పురపాలకసంఘం కమిషనర్ రమణబాబు తెలిపారు. బుధవారం పత్రిక ప్రకటన ద్వారా తెలుపుతూ నందిగామ పట్టణములో ప్రస్తుతము 4 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమములు చేపట్టుట జరుగుచున్నది. నందిగామ పురపాలకసంఘమునకు సంబంధించి 2024-2025 ఆర్థిక సంవత్సరంనకు ఆస్థి పన్ను డిమాండ్ 5.56 కోట్లు గా ఉన్నది. నందిగామ పురపాలకసంఘ ఆర్థిక పరిస్థితి మెరుగుగా లేనందున నందిగామ పట్టణంను అవసరమైన మేరకు అభివృద్ధి చేయుటకు చాలా ఇబ్బందులు కలుగుచున్నది.ఆస్థి పన్ను డిమాండ్ 5.56 కోట్లు కాగా ఇప్పటివరకు 2.70 కోట్లు మాత్రమే, ఇప్పటివరకు చెల్లింపు చేయగా ఇంకనూ 2.86 కోట్లు వసూలు కావలసియున్నది. ఖాళీ స్థల పన్ను డిమాండ్ 73 లక్షలు కాగా అందులో 12 లక్షలు మాత్రమే ఇప్పటివరకు చెల్లింపు చేయగా ఇంకనూ 61 లక్షలు వసూలు కావలసియున్నది. నీటి పన్ను డిమాండ్ 2.26 కోట్లు కాగా అందులో 39 లక్షలు మాత్రమే ఇప్పటివరకు చేయగా ఇంకనూ 1.87 లక్షలు వసూలు కావలసియున్నది. పట్టణం వద్ద పన్ను చెల్లింపు దారులకు విజ్ఞప్తి చేయునది ఏమనగా మీరు చెల్లించిన పన్నులను ఆధారము చేసుకొని సకాలములో కార్యాలయ సిబ్బంది యొక్క జీత భత్యములు చెల్లించగలవారమని, పట్టణము అభివృద్ధి చేయగలవారమని ప్రజాలందరినీ కోరడమైనది. ఆదేవిధంగా ఎక్కువ మొత్తంలో పన్నులు చెల్లించవలసియున్న ప్రజలందరూ కూడా సకాలములో పన్ను చెల్లించవలసినదిగాను అట్లు చెల్లించినచో రాబోయే వేసవి కాలం దృష్ట్యా పట్టణములో మంచినీటి సరఫరా నిరంతరప్రాయముగా జరుగుటకు, నందిగామ పట్టణ అభివృద్ధికి ఎటువంటి అంతరాయము కలుగకుండా మరింత అభివృద్ధికి దోహదపడవలసినదిగా కోరుచున్నాం. నందిగామ పట్టణములోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, వర్తక వాణిజ్య వ్యాపారస్తులు, డ్వాక్రా సభ్యులు, ఉద్యోగులు అందరూ కూడా మీరు చెల్లించవలసిన ఇంటి పన్నులు, నీటి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు, వ్యాపార లైసెన్సులు, ప్రకటన ఛార్జీలు పన్ను బకాయిలు సకాలములో చెల్లించి నందిగామ పట్టణ అభివృద్ధికి మీ యొక్క సహకారం అందించవలసినదిగా కోరుకొనుచున్నాము. పన్ను చెల్లింపుదారులు సకాలంలో పన్ను చెల్లించి పట్టణ పారిశుధ్యము, వీధి దీపములు, నీటి సరఫరా మొదలగు మెరుగైన సేవలు అందించుటలో మీ వంతు సహకారము అందించవలసనదిగా కమిషనర్ కోరారు.



## హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సహాయం

**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** ఎన్.టి.ఆర్.జిల్లా పోలీసు కమిషనరేట్ పరిధిలోని సూర్యాపేట పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డు రాజేష్ యొక్క కుమారుడు (10) గత నెల 26వ తేదీన ఇంటిలో బాత్రూమ్ లోకి వెళుతూ అనుకోకుండా వేడి నీళ్ళ కోసం పెట్టిన వాటర్ హీటర్ మీద పడిపోవడంతో బాలుడి మర్మాంగం వద్ద గాయాలైన్నాయి. వెంటనే దగ్గరలోని ఆసుపత్రిలో జాయిన్ చేసి చికిత్స అందిస్తున్నారు. ఈ నేపధ్యంలో సదరు సంఘటనపై బాలుడి మెరుగైన వైద్యం నిమిత్తం హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సహాయంగా పోలీసు కమిషనర్ వారి వెల్ఫేర్ ఫండ్ నుండి రూ.25 వేలను, అడ్మిన్ డి.సి.పి. కె.జి.వి.సరిత, పరిపాలనా సిబ్బంది కలిసి రూ.50 వేలను, ఎన్.టి.ఆర్. జిల్లా పోలీసు గ్రూప్ ల నుండి రూ.25 వేలను మొత్తం ఒక లక్ష రూపాయలను బుధవారం పోలీసు కమిషనర్ వారి కార్యాలయంలో నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు చేతుల మీదుగా హోంగార్డు రాజేష్ కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డి.సి.పి. కె.జి.వి.సరిత, హోంగార్డు ఆర్.ఐ. కె.సుధా కర రెడ్డి, ఎన్.టి.ఆర్ జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. సోమయ్య, పరిపాలనా విభాగ అసోసియేషన్ ప్రెసిడెంట్ గంగాధర్, అసోసి యేషన్ సంఘ సభ్యులు జి శేషారత్నం జి కళ్యాణి ఏవీఎన్ఎస్ కళ్యాణి, ఆనంద్ బుచ్చయ్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


## నేడే రాయల్ రెస్టారెంట్ టిఫిన్స్ బిర్యాని ప్రారంభోత్సవం





**నందిగామ, మార్చి 5, మేజర్ న్యూస్:** పట్టణంలో కోర్టు రోడ్డులో గురువారం రాయల్ రెస్టారెంట్ అండ్ టిఫిన్ హోటల్ ప్రారంభోత్సవం నిర్వహిస్తున్నట్లు ప్రొప్రైటర్ ఎండి ఇబ్రహీం తెలిపారు. ఈ సందర్భంగా పత్రిక ప్రకటన ద్వారా తెలుపుతూ రంజాన్ మాసం సందర్భంగా ప్రతిరోజు హలీం లభిస్తున్నట్లు తెలిపారు. అన్ని రకముల ఫంక్షన్లకు వెజ్ అండ్ నాన్ వెజ్ ఆర్డర్లపై కేటరింగ్ చేయబడును. చికెన్, మటన్, దమ్ బిర్యాని బాస్మతి రైస్ తో చేయుట మా ప్రత్యేకత. ఉచిత హోమ్ డెలివరీ సౌకర్యం కలదు. సెల్ 89786 71557 సంప్రదించవలసిందిగా తెలిపారు.

## ఆలపాటి రాజాకు శుభాకాంక్షలు తెలిపిన స్వర్ణాంధ్ర టీచర్స్ అసోసియేషన్



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బుధవారం కృష్ణ,గుంటూరు గ్రాడ్యుయేట్ శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజాని, గుంటూరులోని ఆయన నివాసంలో కలిసి యంఎల్‌సీగా ఎన్నికైనందున శుభాకాంక్షలు తెలియజేసిన స్వర్ణాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సాలార్., రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మీర్జా రియాజ్ హుస్సేన్,అదేవిధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేయుచున్న స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ కాలేజీలలో జూనియర్ లెక్చరర్లుగా ప్రమోషన్ వచ్చేటట్లు కృషి చేయవలసిందిగా కోరారు. ఆలపాటి రాజా మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి తెలియజేసి సమస్యను పరిష్కరించేటట్లుగా చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999